## మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రత, సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వంటి పథకాలు మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు. మహిళలు ప్రతి రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, మహిళా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కుర్మే మహేందర్ ను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని గజేందర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహేందర్కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న కుర్మే మహేందర్కు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం బోథ్ నియోజకవర్గానికి గర్వకారణమని అన్నారు. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేస్తూ, రాబోయే రోజుల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి మహిళా సంఘాలు కీలకం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, వారి సమస్యల పరిష్కారానికి మహిళా సంఘాలు ఎంతో దోహదపడతాయని ఇచ్చోడ మండలం గుండివాగు గ్రామ సర్పంచ్ గాయక్వడ్ శోభరాణి అన్నారు. సోమవారం గుండివాగు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వీవో భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాయక్వడ్ గణపతి, వీవోలు పులాజి బాబా, లక్షి బాయి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండల కేంద్రంలో ఐకేపీ నూతన భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీల సోమవారం భూమి పూజ చేశారు. మహిళా సంఘాల బలోపేతం, వారి సమావేశాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ భవనం ఎంతగానో ఉప యోగ ప డుతుంద ని అన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుజాత, ఎంఎస్ఏ స్వప్నిల్, సీసీ స్వప్న, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి

- నేటి నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు
- సాయంత్రం 4 గంటలకు మహిళా సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి
- మహిళా శక్తి మహోత్సవమిది : మంత్రి సీతక్క

**ఉద్యమ కెరటం, హన్మకొండ:** రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమవుతున్న మహిళా వారోత్సవాలను మహిళలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన అక్కచెల్లెలకు మహిళా వారోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆమె ప్రజాభవన్ నుంచి వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈనెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలు కేవలం కార్యక్రమాలు మాత్రమే కాదని, మహిళా శక్తి, సామర్థ్యాలు, ఆత్మవిశ్వాసం, సాధికారతను ప్రపంచానికి చాటి చెప్పే మహోత్సవమని పేర్కొన్నారు. "ఇది మహిళా శక్తి మహోత్సవం.. ఇది ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర అని అన్నారు. ఒకప్పుడు చిన్న పొదుపులతో ప్రారంభమైన స్వయం సహాయక సంఘాలు నేడు తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా, ఉపాధి సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతోందన్నారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, సెంట్రింగ్ యూనిట్లు, ఇటుకల తయారీ కేంద్రాలు వంటి రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని చెప్పారు. మహిళలు ఆర్థికంగా స్వాలంబులు కావడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిస్తోందన్నారు. గ్రామీణ మహిళలకు గౌరవప్రదమైన వేదికలు కల్పించే దిశగా 8వేల మహిళా భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇది మహిళల పట్ల ఇందిరమ్మ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. కోటి చీరల పంపిణీతో పాటు రూ.60వేల కోట్లకు పైగా బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలం అందిస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్య సాధన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళా సంఘాలు బలపడితే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘ సభ్యులతో ముఖాముఖి నిర్వహించనున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి పోర్టల్లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును గరిష్టంగా 30 రోజుల్లోపు పరిష్కరించడం అధికారుల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక



భద్రత పెన్షన్లు, ఉపాధిహామీ పనులు, భూ సమస్యలకు సంబంధించి మొత్తం 91 ఫిర్యాదులు అందాయని, వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలించి, తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్లో సకాలంలో నమోదు చేయాలని సూచించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ముఖ్యంగా పెండింగ్లో ఉన్న అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, డీఏండబ్ల్యూఓ కలీం, తహశీల్దార్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 1న ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జూన్ 1న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సోమవారం క్యాంప్ కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, సామూహిక గృహప్రవేశాలు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల సర్వే, నిలిచిపోయిన ఇళ్ల పనులపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో గృహప్రవేశాల కింద మొత్తం 2,773 ఇళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 1,708 ఇళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 1,065 ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని హౌసింగ్, మండల అధికారులను ఆదేశించారు. జూన్ 1 నాటికి ఈ ఇళ్లన్నింటినీ సిద్ధం చేసి, లబ్ధిదారులతో ఉమ్మడిగా గృహప్రవేశాలు చేయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మరోవైపు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అర్హులైన లబ్ధిదారుల గుడిసెల వివరాలను గెజిటెడ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే చేయించాలని ఆదేశించారు. ఈ సర్వే నివేదికలను నేరుగా కలెక్టర్ లాగిన్కు పంపాలని, తద్వారా వీలైనంత త్వరగా వీటికి మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. వీటితో పాటు జిల్లాలో ఇంకా పనులు ప్రారంభం కాని ఇళ్లు ఉంటే, వెంటనే



లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ నోడల్ అధికారి శంకర్, ఈడియం రవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ లేక అష్ట కష్టాలు

- సాత్ నంబర్ గ్రామ ప్రజల ఆవేదన
- రహదారిపైనే గంటల తరబడి నిరీక్షణ
- ఎండ, వానల్లో నరకం
- స్పందించని అధికారులు.

**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** రాష్ట్రంలోని ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రయాణికుల కనీస అవసరాలు మాత్రం తీరడం లేదు. దీనికి నిదర్శనంగా నిలుస్తోంది సాత్ నంబర్ గ్రామం. సరైన బస్టాండ్, బస్ షెల్టర్ లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు, ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**ఎండైనా.. వానైనా.. రహదారిపైనే దిక్కులేని ప్రయాణం**

దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు బస్సు కోసం వచ్చేసరికి అక్కడ కనీసం ఆశ్రయం పొందేందుకు నీడ కూడా లేదు. దీంతో గ్రామస్థులు మండుటెండల్లోనూ, వర్షంలోనూ గంటల తరబడి రహదారి పక్కనే నిలబడి



బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితిsy ప్రయాణికులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.

**నానా ఇబ్బందులు పడుతున్న మహిళలు, వృద్ధులు**

ప్రధానంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలతో ప్రయాణించే కుటుంబాలు, విద్యార్థులు ఈ సమస్యతో అత్యధికంగా ప్రభావితమవుతున్నారు. సురక్షితమైన ప్రదేశం లేకపోవడంతో మహిళలు ఆందోళన చెందుతుండగా, వృద్ధులు గంటల కొద్దీ నిలబడలేక నరకం చూస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

ఈ సమస్యపై ఇప్పటికే అనేకసార్లు స్థానిక అధికారులు, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు విన్నవించినా, దరఖాస్తులు సమర్పించినా ఎలాంటి స్పందన లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని, అధికారుల మొండి వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కనీసం బస్సు కోసం ఆశ్రయం ఇచ్చే ఒక షెల్టర్ ఏర్పాటు చేయలేని స్థితిలో ఉండటం చాలా బాధాకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల కష్టాలను గుర్తించాలని కోరుతున్నారు.సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే ఈ సమస్యపై స్పందించి, సాత్ నంబర్ గ్రామ ప్రజల ప్రయాణ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం తక్షణమే బస్టాండ్, లేనియెడల కనీస వసతులతో కూడిన బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠా బట్టబయలు

- 30 కేజీల విత్తనాలు స్వాధీనం
- నలుగురు అరెస్ట్, సూత్రధారి పరారీలో

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాల విక్రయ వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకొని, సుమారు 30 కేజీల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం తాండూర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రేచిని గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద బైక్పై రోళ్లపాడు నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి కె.సుష్మ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్పై సంచుల్లో తరలిస్తున్న నకిలీ పత్తి



విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రోళ్ళపాడు, రెచిని గ్రామాలకు చెందిన గోగర్ల మల్లేష్, ముక్క శ్రీకాంత్, గాండ్ల మహేష్, పిడుగు లక్ష్మణను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చీరాలకు చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ ప్రధాన సూత్రధారిగా ఉన్నాడని, అతడు తన పొలాలను కౌలుకు చేసే మల్లేశ్ ద్వారా ఈ విత్తనాలను మోటార్ సైకిల్పై తీసుకువచ్చి రెచిని గ్రామస్థులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వాడకంతో భూమి సారవంతం తగ్గిపోవడంతో పాటు పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్లైఫోసేట్ కలిగిన నకిలీ విత్తనాల ద్వారా పర్యావరణానికి హాని కలగడమే కాకుండా రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని తెలిపారు. రైతులు ప్రభుత్వ అనుమతితో సరఫరా అయ్యే విత్తనాలనే వినియోగించాలని, లైసెన్సు పొందిన ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లోనే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ విత్తనాల విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తాండూర్ సీఐ దేవయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కోటి మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం






- సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర వ్యాప్తంగా 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ శంకుస్థాపన

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాల భూమి పూజ కార్యక్రమాన్ని సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. హైదరాబాద్లోని రాష్ట్ర సచివాలయం నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.అనసూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిల్లా శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లాల వారీగా కలెక్ట ర్లు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపనలు చేయడం గర్వ కారణమన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60,470 కోట్ల రుణాలు అందించామని, దాని ద్వారా సుమారు 5లక్షల మంది మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగారని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు, రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా, స్థానిక సంస్థల అదనపు కలెక్ట ర్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఇతర జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాల బలోపేతానికి జిల్లా యంత్రాంగం తరపున మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయంపై మహిళా సంఘాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత

- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళా సంఘాల సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుంచి జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం వివిధ రంగాల్లో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. సోలార్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి వ్యాపారాలను మహిళలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, రిలయన్స్ వంటి సంస్థల సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీకి అద్దె బస్సుల ఒప్పందాల ద్వారా మహిళలకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బ్యాంకు లింకేజీ రుణాలను రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి, మొత్తం రూ.60,471 కోట్ల రుణాలు అందించామని వివరించారు. వడ్డీ లేని రుణ సదుపాయం కింద స్వయం సహాయక సంఘాలకు రూ.1,390 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మహిళా సంఘాలకు మరింత రుణ సదుపాయం లభిస్తుందని, ఇతరులకు ఆదర్శంగా నిలవవచ్చని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,500 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, భవిష్యత్తులో మహిళా సంఘాలను రైస్ మిల్లుల స్థాపన, నిర్వహణలో ప్రోత్సహించనున్నామని పేర్కొన్నారు. జిల్లాల్లో ప్రభుత్వ భూముల లభ్యతను పరిశీలించి రైస్ మిల్లులు, గోదాముల ఏర్పాటుకు నివేదికలు సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి సూపర్ బజార్ల ఏర్పాటు ద్వారా నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూములను నామమాత్రపు అద్దెకు మహిళా సంఘాలకు కేటాయించి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# చెన్నూర్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

- అదనపు లారీలు, గోదాముల ఏర్పాటుకు చర్యలు
- మంత్రి గడ్డం వివేకానంద



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ ఈసారి చెన్నూర్ నియోజకవర్గంలో వరి పంట అంచనాలకు మించి అధిక దిగుబడి వచ్చిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, తద్వారా కొనుగోలు ప్రక్రియ మరింత సులభంగా సాగుతుందని సూచించారు. చెన్నూర్ ప్రాంతంలో ధాన్యం నిల్వ కోసం గోదాముల సౌకర్యం పెంపొందించడంతో పాటు హమాలీల సంఖ్యను కూడా పెంచుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న లారీలకు అదనంగా 75 లారీలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాబోయే వారం రోజుల్లో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ నిర్దేశిత మద్దతు ధర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆలస్యం చేయకుండా తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం



**ఉద్యమ కెరటం, సాత్నాల:** కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా సాత్నాల మండలం జమిని గ్రామంలో సోమవారం ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సోయం తులసిదాస్, మండల అధ్యక్షుడు కినక బాపూరావు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జమిని గ్రామంతో పాటు సైదపూర్, రేణిగూడ, దావునా, పాతాగూడ గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రాబోయే రోజుల్లో గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామస్థాయిలో పార్టీని మరింత బలపర్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జమిని గ్రామ సర్పంచ్ పెందూర్ ఇస్తారీ, మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్, రాథోడ్ రోహిదాస్, సిడం అయ్యు, కినక నరేష్, కొడప విలాస్, కనక విఠల్, కినాక్ పుల్చేంద్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ రెడ్డి కుటుంబానికి ఆడే గజేందర్ పరామర్శ



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఇచ్చోడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాగర్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాగర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కుర్మే మహేందర్కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కుర్మే మహేందర్ను ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న కుర్మే మహేందర్కు రాష్ట్ర స్థాయి పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన మరింత సమర్థంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కుర్మే మహేందర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

